క్లుప్తంగా

ఆలయంలో కాటసాని పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు ఎస్టేట్‌లోని గోడల హనుమంతరాయుడు స్వామి దేవాలయంలో వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం దేవాలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ధర్నా



వార్డు సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప, ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 30, 32వ వార్డుల్లోని శరీన్‌నగర్, ముజఫర్‌నగర్ పరిధిలోని వార్డు సచివాలయాల వద్ద ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ఆయా వార్డు సచివాలయల ఉద్యోగులకు వినతిపత్రాలు అందజేశారు. పార్టీ నాయకులు ఆనంద్, షంషీర్, శ్రావణ్‌కుమార్, దానమ్మ, సాలమ్మ, ఏసు, ఈశ్వరమ్మ, బీసన్న పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామికి మహా రుద్రాభిషేకం



భక్తులకు దర్శనమిస్తున్న భోగేశ్వరస్వామి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో కొలువైన దుర్గా భోగేశ్వరస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం, అష్టవిధ మహా మంగళహారతులు, మంత్ర పుష్పం తదితర పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

ఘనంగా వసంత పంచమి

పాణ్యం: మండలంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సరస్వతీ పూజలు చేశారు. తల్లిదండ్రులు పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు (టౌన్): నగరంలోని పూల బజార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడు భిక్షాటన చేస్తూ పొట్టనింపుకునేవాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో స్థానికంగా కంసాలి సందులో ఉన్న ఆశా మెడికల్ షాపు షట్టర్స్ వద్ద అనుకొని భోజనం చేస్తూ పక్కకు ఒరిగిపోయి కన్నుమూసినట్లు ఒకటవ పట్టణ పోలీసులు సోమవారం వెల్లడించారు. అతనికి సంబంధించిన వ్యక్తులు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

5న మహిళా హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు నంద్యాల పట్టణంలోని ఎస్.పీ.జీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సీనియర్ మహిళల హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు దాసరి సుదీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1996 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు పట్టణంలో నిర్వహించనున్న 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 99665 65317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏటిపాయపై నీలినీడలు..!

- 1996లో వరదల ధాటికి కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్
- 29 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.3.25 కోట్లతో ప్రతిపాదనలు
- అంచనాలు పెంచి పంపాలని వెనక్కు పంపిన ఉన్నతాధికారులు
- చెక్‌డ్యామ్ నిర్మిస్తే తాగు, సాగునీటికి ఢోకా ఉండదంటున్న రైతులు



శిథిలమైన శిలాఫలకం



కోతకు గురైన ఏటిపాయ చెక్‌డ్యామ్



గత ప్రభుత్వ హయాంలో పంపిన ప్రతిపాదనలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో ఏటిపాయ నిర్మాణంపై నీటినీడలు కమ్ముకున్నాయి. 29 ఏళ్లుగా గ్రామస్తుల కోరిక కలగానే మిగిలింది. రెండు కొండల మధ్య ఉన్న ఈ గ్రామానికి తాగు, సాగు నీటి ఇబ్బందులు అధికం. దీంతో బేతంచెర్ల మండలం కొండలపై నుంచి వచ్చే నీటిని నిలబెట్టి తద్వారా బోర్లకు భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో ఏటిపాయపై 1992లో చెక్‌డ్యామ్ నిర్మించారు. అయితే 1996లో వచ్చిన భారీ వరదలకు చెక్‌డ్యామ్ పూర్తిగా దెబ్బతినింది. అప్పటి నుంచి ప్రతిసారి అధికారులు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఈ వాగు 149.47 ఎకరాల విస్తీర్ణంలో ప్రవహిస్తుంది. ఇందులో 49.09ఎకరాల ఫారెస్టు రిజర్వ్ పొలాలు ఉన్నాయి. వాగు వెంట 1674.89 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. వ్యవసాయ భూమి 996.37 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఈ భూములకు మొత్తం 360 బోర్లు ఉన్నాయి. ఈ వాగుపై చెక్‌డ్యామ్ ఉన్న సమయంలో వ్యవసాయ బోర్లకు పుష్కలంగా నీరు వచ్చేవి. దీంతో ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా పంటు సాగు చేసేవారు. గ్రామంలో ఇసుక నెలలు ఉండడంతో రైతులు అధికంగా కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు సాగు చేసేవారు.

నీటి సమస్య

1996లో చెక్‌డ్యామ్ కొట్టుకుపోవడంతో ప్రస్తుతం బోర్లకు ఖరీఫ్‌లో అంతంత మాత్రంగానే నీరు వస్తున్నాయి. రైతులు కూరగాయాల సాగుకే పరిమితం అవుతున్నారు. భూగర్భజలాలు క్రమంగా ఇంకిపోతుండడంతో చాలా మంది రైతులు బోర్లకింద సాగు ఒక్క పంటకే పరిమితం చేస్తున్నారు. అంతేకాక గ్రామానికి ప్రతి వేసవిలో నీటి సమస్య ఎదురవుతోంది. వాగులో నీటి ప్రవాహం ఉన్న సమయంలో బోర్లు రీచార్జ్ అవుతాయి. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఓహెచ్‌ఆర్‌ను నిర్మించి తాగునీటి సమస్యకు చెక్ పెట్టారు. సాగుకు నీరు అందించాలంటే ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మాణమే ఏకైక మార్గం అని భావించారు. ప్రతిపాదనలు పంపారు.

ప్రతిపాదనలు పంపాం

ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం గతంలో రూ. 3.25 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. అయితే అంచనాలు పెంచి పంపాలని అధికారులు సూచించడంతో మరోమారి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

–నాగన్న, డీఈఈ, మైనర్ ఇరిగేషన్

కల నెరవేరేనా..?

తమ్మరాజుపల్లె గ్రామస్తుల ఆకాంక్ష అయిన ఏటిపాయ చెక్ డ్యామ్ నిర్మాణంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటిపాయ నిర్మాణానికి అధికారులు రూ.3.25 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జాప్యం చోటుచేసుకుంది. ఇటీవల అధికారులు ఆ ప్రతిపాదనలు వెనక్కు పంపి అంచనా పెంచి పంపాలని సూచించారు. పనులకు కార్యరూపం దాల్చేనా అని గ్రామస్తులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

కోడుమూరు పీఎస్ తనిఖీ



పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కోడుమూరు రూరల్: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం రాత్రి కోడుమూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు సమస్యాత్మక గ్రామాల వివరాలు, కేసులపై కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ శ్రీనివాసులుతో ఆరా తీశారు. విధుల్లో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలకు గౌరవం ఇచ్చి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు కొండాపురంలో పొలం పిలుస్తోంది

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. ఉదయం కొండాపురం, మధ్యాహ్నం ముడుమాల గ్రామ సచివాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పంట పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తామని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షణ అవసరం

- జిల్లా నోడల్ అధికారి రఘు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి రఘు

ఓర్వకల్లు: గర్భిణుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా నోడల్ అధికారి రఘు అన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాల్వ గ్రామంలో సంచార వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి వారికి ఆరోగ్య సూత్రాలు తెలియజేయడంతో పాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కాన్పు జరిగే రోజులను అంచనా వేసి ముందస్తుగానే వారు ఆస్పత్రుల్లో చేరేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి సమస్యలు ఉన్న హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు, చికిత్సలు చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజ న పథకం ద్వారా మొదటి కాన్పుకు రూ.5 వేలు నగదు ప్రోత్సాహం అందిస్తామని, రెండో కాన్పులో ఆడ శిశువుకు జన్మనిచ్చిన మహిళకు రూ.5000 అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి రేఖ, సామాజిక ఆరోగ్య అధికారి అఖిల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

25 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



ఆలయ ఈఓ మద్దిలేటి సమక్షంలో లఘ్న పత్రిక తయారు చేస్తున్న అర్చకుడు

- కాల్వబుగ్గలో వారంపాటు వేడుకలు

ఓర్వకల్లు: మండలంలోని బుగ్గరామేశ్వరస్వామి (కాల్వబుగ్గ) ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు నిశ్చయించారు. ఈ మేరకు సోమవారం కాల్వబుగ్గ దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు క్లై లక్ష్మి నారాయణ శర్మ లఘ్న పత్రిక తయారు చేసి, ఆలయ ఈఓ మద్దిలేటికి సమర్పించారు. అందుకు సంబంధించిన వివరాలను ఈఓ మద్దిలేటి వివరించారు. ఫిబ్రవరి 25వ తేదీ కాల్వ గ్రామం నుంచి స్వామి, అమ్మవార్ల వరప్రయాణం ఉంటుందన్నారు. 26వ తేదీ మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణ, మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, రాత్రి స్వామివారికి యమాభిషేక పూజలు నిర్వహిస్తారు. 27వ తేదీ తెల్లవారుజామున 4.25 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, ఉదయం 11 గంటలకు సింహ వాహనసేవ, సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం జరుగుతుంది. 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ఉంటుంది. మార్చి 1వ తేదీ వసంతోత్సవం, సాయంత్రం పారువేట కార్యక్రమం జరుగుతుంది. 2వ తేదీ ఉత్సవ మూర్తులు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణం, గ్రామోత్సవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానికులు కాటినేని నారాయణ, వేణుగోపాల్, ఆకుల మహేష్, చంద్ర పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తుతో పాటు పేరు ప్రఖ్యాతలు వస్తాయని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. చౌడేశ్వరీ దేవి తిరునాల సందర్భంగా కోడుమూరులోని ఎస్ఆర్‌టీ మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను సోమవారం కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ భాగ్యరత్న ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడంతో పాటు, శారీరక ధృడత్వానికి, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. గ్రామీణ క్రీడలను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని సూచించారు నిర్వాహకుడు దస్తగిరి మాట్లాడుతూ.. 12 రోజుల పాటు జరిగే క్రికెట్ పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, 2వ బహుమతిగా రూ.25వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆంధ్రయ్య పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో ఆరోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): బాల్య వివాహాల కారణంగా భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు వస్తాయని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం స్థానిక శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాల తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని, అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. చిన్న వయస్సులో గర్భదారణ వల్ల గర్భస్రావం, మృతశిశువు జననం, బరువు తక్కువగా పిల్లలు జన్మించడం, తల్లికి తీవ్ర రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో ఎదుగుదల త్వరగా ఉంటుందని, వారు ఐరన్, కాల్షియం అధికంగా ఉన్న పాలు, ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తీసుకోవాలన్నారు. రక్తహీనత నివారణకు వారానికి ఒకసారి ఐరన్ మాత్ర వేసుకోవాలన్నారు. ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, ప్రధానోపాధ్యాయులు శాంత సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

కంది కొనుగోళ్లు ప్రారంభం



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: స్థానిక సహకార సంఘం వద్ద కంది కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంది పంటను సాగు చేసిన రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ అధికారులతో మాట్లాడి, కంది దిగుబడులను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాణ్యతను బట్టి క్వింటాల్ కందులు రూ.7550 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఓర్వకల్లు మండలంలో 266 ఎకరాల్లో కంది పంటను వేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 132 మంది రైతులు ఈకేవైసీ చేసుకోవడం జరిందని, వ్యవసాయాధికారుల గణాంకాల ద్వారా తెలిసిందని వివరించారు. ఎకరాకు 4.8 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కందులతో పాటు శనగ పంటను కూడా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరగా, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వద్ద డ్రైనేజీ కల్వర్టు దుస్థితిని పరిశీలించారు. త్వరితగతిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీసీఓ జాఫ్రిన్, వ్యవసాయాధికారి సుధాకర్, సహకార సంఘం అధికారి మద్దిలేటి, రీసర్వే డీటీ షర్మిలారెడ్డి, సీఈఓ మద్దిలేటి, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, గోవింద రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

కంది రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందులను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని.. సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. సోమవారం కోడుమూరు వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ సిబ్బంది ఏర్పాటు చేసిన కందుల కొనుగోళ్లను ఏఓ రవిప్రకాష్ ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసి, పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి గరిష్ఠంగా 100 క్వింటాళ్ల వరకు క్వింటాల్ రూ.7550 ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కందులు అమ్ముకోవాలనుకునే రైతులు ఆధార్, బ్యాంకు పట్టాదారు పాసుపుస్తకాల వివరాలతో ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగేశ్వరరెడ్డి, సిబ్బంది నాగరాజు, ఇలియాస్, రైతు సేవా కేంద్రం సిబ్బంది జయంత్, ప్రవీణ్, విజయశాంతి పాల్గొన్నారు.

నర్సింగ్ స్కూల్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన సోమవారం కలెక్టరేట్ పక్కన ఉన్న ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌ను తనిఖీ చేశారు. నర్సింగ్ విద్యార్థులకు అందిస్తున్న భోజనం, భవనాల గురించి ఆరా తీశారు. నర్సింగ్ స్కూల్‌కు కావాల్సిన ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు వెంటనే ప్రారంభం అయ్యేలా చూడాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని డైట్ సిబ్బందికి సూచించారు. అనంతరం శాలమ్మ సత్రంలోని గదులను తనిఖీ చేశారు. ఐపీ రోగులకు వసతుల విషయమై అవగాహన కల్పించాలని జీపీఆర్ ట్రస్ట్ సిబ్బందిని ఆదేశించారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

టెంకాయపై ఉరుకుంద ఆలయ రాజగోపురం





చిత్రకారుడు మల్లికార్జున

ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు మల్లికార్జున ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాన్ని టెంకాయపై చిత్రీకరించి అబ్బురపరిచాడు. ఉరుకుంద ఈరన్నస్వామి వారి మహా కుంభాభిషేకం, రాజగోపురాల ఆవిష్కరణ సందర్భంగా టెంకాయపై పెయింటింగ్ సాయంతో తూర్పు రాజగోపురాన్ని మూడు గంటలపాటు శ్రమించి వేసినట్లు ఆయన తెలిపారు.

రేపు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 5వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్-16 విభాగంలో యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా తెలిపారు. 2009 జనవరి 1 తరువాత పుట్టిన బాలబాలికలు పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు 9985161007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జంతు సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జేడీ డాక్టర్ శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): జంతు సంక్షేమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కోరారు. సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో జీవ జంతు కళ్యాణ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు జంతు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, జంతుప్రేమికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువులను సంరక్షించడం, వాటి ఆకలి, దప్పిక తీర్చడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భారీ వాహనాల్లో సైతం ఆరు పశువులకు మించి తరలించరాదని, ప్రతి ఆరు గంటలకు ఒకసారి వాటికి మేత, నీరు పెట్టి విశ్రాంతి కల్పించాలన్నారు. జంతువులను హింసించడం, బాధపెట్టడం, భయపెట్టడం, అక్రమంగా రవాణ చేయడం, తలకిందులుగా వేలాడదీసి రవాణ చేయడం నేరమని తెలిపారు. ఇటువంటి నేరాలకు శిక్షలు, జరిమానాలు ఉన్నాయని వివరించారు. జంతు సంక్షేమానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని సూచించారు. ఎస్పీఎల్‌ఏ సభ్యులు మణిలాల్‌జైన్, గాయత్రీ గోశాల నిర్వాహకులు జగదీష్, బహుళార్థ పశువైద్యశాల డీడీ హేమంత్‌కుమార్, డివిజినల్ డీడీలు దుర్గాప్రసన్నబాబు, వెంకటరమణ, ఏడీలు భవానిశంకర్‌రెడ్డి, రవిబాబు, సుధాకర్, సుబాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.


● సారోళ్లు లేరు



ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:40 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకావడంపై మండల అధికారుల నిర్లక్ష్యపు ధోరణి కొనసాగుతూనే ఉంది. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు ప్రతి వారం మండిపడుతున్నా, అధికారులు తీరు మాత్రం మారడం లేదు. ఇందుకు సోమవారం అధికారులు ప్రవర్తించే తీరే నిదర్శనంగా నిలుస్తుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 10:40 గంటల వరకు అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. 10:47 గంటలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, 10:52కు ఎంపీడీఓ రాణెమ్మ, 10:54 గంటలకు ఏపీఓ రామన్న, 10:58 గంటలకు ఏపీఎం రామేశ్వర్ తాపీగా కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించగా, అనంతరం ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 11 గంటలైనా వైద్య అధికారులు, ఎంఈఓలు, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పీఆర్, ఇరిగేషన్ ఏఈలు, పశువైద్యులు ఎలాంటి సమాచారం లేకుండా కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. మండల అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10న రిలే నిరాహార దీక్ష



కరపత్రాలను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

పాణ్యం: మండల పరిధిలోని ప్రజా, రైతు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 10, 11 తేదీల్లో రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్, సమాజ్‌వాదీ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వనం వెంకటాద్రి మాట్లాడుతూ.. 48 గంటల నిరాహార దీక్షలకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. నాయకులు మద్దయ్య, వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.